క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

పూతలపట్టు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గౌరి ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం ప్రారంభం కానున్నట్లు తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని కోరారు.

డాక్ సేవక్స్ ఒక్కరోజు సమ్మె

చిత్తూరు రూరల్: నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద బుధవారం ఆల్ఇండియా గ్రామీణ డాక్‌సేవక్స్ యూనియన్ నాయకులు ఒక్కరోజు సమ్మె చేపట్టారు. 8 గంటలు పని, పింఛన్‌తో సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక ఉన్నతి కల్పించాలని, గ్రాట్యూటీ రూ.4 లక్షలకు పెంచాలని, తాత్కాలిక పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో దిలీప్‌కుమార్‌రెడ్డి, బాబు, కుప్పస్వామి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు సంక్రాంతిపల్లెలో వైద్య శిబిరం

బంగారుపాళెం: మండలంలోని సంక్రాంతిపల్లెలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి లోహిత్‌చెంగల్‌రాయన్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఐరాల: మండలంలోని ఎర్రేపల్లె సచివాలయ పరిధిలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హాజరుకానున్నట్లు తెలిపారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక హాజరు కావాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్స్ తగ్గించాలి

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు రూరల్ డివిజన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్స్ తగ్గించాలని ట్రాన్స్‌కో ఈఈ హరి తెలిపారు. ఈఈ కార్యాలయంలో డీఈ, ఏఈలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు అయితే రెండు రోజుల్లో మార్పు చేసి ఇవ్వాలన్నారు. కరెంటు బిల్లులు వందశాతం వసూలు చేసే విధంగా కృషి చేయాలన్నారు. జీఐఎస్ సర్వేను ప్రస్తుతం 69 శాతం జరిగిందని, ఈ నెలలో వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు: పట్టణంలోని గూడూరుపల్లె వద్ద ఉన్న ఐటీఐ కళాశాలలో వివిధ ట్రేడ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, కళాశాలలో డీజిల్ మెకానిక్, ఫ్యాషన్ టెక్నాలజీ, వెల్డర్ కోర్సులు ఉన్నాయని, పదోతరగతి, ఇంటర్ పాస్/ఫెయిల్ అయిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

బంగారుపాళెంలో భారీ వర్షం



ఇళ్లలోకి వచ్చిన నీరును బయటికి పోస్తున్న మహిళలు

బంగారుపాళెం: మండలంలో బుధవారం సాయంత్రం ఓ మోస్తారు భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉక్కపోత పోసింది. సాయంత్రం సుమారు గంట వరకు భారీ వర్షం కురిసింది. దాంతో మురుగు నీటి కాలువలు పొంగిపొర్లాయి. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై వర్షపు నీరు, మురుగు నీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రహదారి పక్కన నివాస గృహాల్లోకి వర్షపు నీరు ప్రవహించడంతో ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారి పక్కన పెద్ద డ్రైనేజీ కాలువ నిర్మించాలని కోరుతున్నారు.

డ్రాపౌట్స్ గుర్తింపు

పలమనేరు: పట్టణంలో వీధిబాలలను గుర్తించి వారిని బడిలో చేర్పించేందుకు స్థానిక విద్యాశాఖ, ఐసీడీఎస్ అధికారులు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు, ఎంబీటీ రోడ్డు, వారపు సంత ప్రాంతం, గంగమ్మ గుడి వీధుల్లో ముగ్గురు వీధిబాలలు, ఇద్దరు డ్రాపౌట్స్‌ను గుర్తించారు. డ్రాపౌట్స్ తల్లిదండ్రులకు ఎంఈఓ లీలారాణి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ శాఖ అధికారులు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

బంగారుపాళెం: వృద్ధురాలికి కంటి అద్దాలు పెడుతున్న మొగిలీశ్వర్, యాదమరి: వృద్ధులకు అద్దాలను అందిస్తున్న ఎంపీపీ సురేష్ బాబు, ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి







అందరికీ ఉచిత వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు
- రోగులకు ఉచితంగా కళ్లద్దాల పంపిణీ



పూతలపట్టు: ఆయుష్మా కార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఊరూరా ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు సూచించారు. మండలంలోని వావిల్‌తోట పంచాయతీ పరిధిలో బుధవారం కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు మాట్లాడుతూ ఈ వైద్య శిబిరాన్ని పంచాయతీ పరిధిలోని 453 మంది సద్వినియోగం చేసుకున్నట్లు వివరించారు. అనంతరం కంటి చూపు మందగించిన వారికి వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మురళీకృష్ణ, ద్వారకనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు తలపులపల్లి బాబురెడ్డితోపాటు నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, రాజారత్నంరెడ్డి, సర్పంచ్ మహేశ్వరి, ఎంపీడీఓ గౌరి, వైద్యాధికారులు ప్రియాంక, ప్రవీణ, పంచాయతీ కార్యదర్శి రాజా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం

బంగారుపాళెం: గ్రామాల్లో పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సౌకర్యాలు కల్పిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మొగిలీశ్వర్ అన్నారు. మండలంలోని బోడబండ్ల గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ సభ్యుడు హరి ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో పాల్గొన్న మొగిలీశ్వర్ మాట్లాడుతూ, ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నిపుణులైన వైద్యులు రోగులకు పరీక్షలు చేసి, వ్యాధి తీవ్రతను బట్టి మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామీణులకు జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వరమని తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. పల్లె ప్రజలు రోగాలతో బాధపడకూడదని ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. అనంతరం వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా వృద్ధులకు ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్, గ్రామ కార్యదర్శులు మధు, రఘు పాల్గొన్నారు.

జంగాలపల్లెలో ఆరోగ్య సురక్ష

యాదమరి: మండల పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సురేష్‌బాబు కోరారు. మండలంలోని జంగాలపల్లె సచివాలయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. తహసీల్దార్ హనుమంతు మాట్లాడుతూ మెరుగైన వైద్యం గ్రామీణ ప్రజలకు ఉచితంగా ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నట్లు వివరించారు. చికిత్సల అనంతరం ఉచితంగా మందులు అందిస్తున్నట్లు తెలియజేశారు. వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలను ఎంపీపీ సురేష్‌బాబు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివరాజ్, వైద్యులు సీహెచ్ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలం వరం

తవణంపల్లె: ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి తెలిపారు. మండలంలోని పుణ్యసముద్రం సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. వైద్యాధికారులు ప్రియాంక, మోహనవేలు, నిష్ణాతులు ప్రసాద్, శివరాం, 438 మందికి ఏడు రకాల జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. క్యాంపును డీఎంఓ శ్రీనివాసులు పర్యవేక్షించి వైద్యులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఐరాల సీడీపీఓ నిర్మల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వివిధ రకాల వంటలు, తాజా కూరగాయలు స్టాల్‌కు అధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, పీహెచ్ఎన్ భారతి, సీహెచ్ఓ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, వలంటీర్లు, ఎంపీటీసీ డేవిడ్, సర్పంచ్ జయసుధ, పంచాయతీ కార్యదర్శులు స్వర్ణాదేవి, హరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు వరప్రసాద్ రెడ్డి, వేణుగోపాల్, కుమార్, బాబు పాల్గొన్నారు.

దాతల సేవలు మరువలేం



ప్లస్-2 కళాశాలకు లేబొరేటరీ పరికరాలను అందజేస్తున్న దాతలు

ఐరాల: కాణిపాకం జెడ్పీ హైస్కూల్ (ప్లస్-2) కళాశాలకు దాతలు చేస్తున్న సేవలు మరువలేమని ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. కాణిపాకం ఉన్నత పాఠశాలలో బుధవారం ప్లస్ 2 విద్యార్థినులకు చినకాంపల్లెకు చెందిన దాతలు హరిప్రసాద్‌రెడ్డి, కిషోర్, గణేష్, పూతలపట్టుకు చెందిన దాత మహేష్ రూ.40 వేల విలువ చేసే లేబొరేటరీ పరికరాలను కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఎం మాట్లాడుతూ వేరే కళాశాలకు వెళ్లి ప్రయోగాలు చేసే అవసరం లేకుండా దాతలు కళాశాలకు కావలసిన పరికరాలను అందజేయడం అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్లస్-2 విద్యార్థినులు ఆహ్లాదకరంగా మన కళాశాలలోనే ప్రయోగాలు చేసుకొని ఉజ్వల భవిష్యత్తుతో ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల బిల్డింగ్ కమిటీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో దాతల సహకారంతో పాఠశాలను, కళాశాలను అన్ని హంగులతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బొమ్మసముద్రం సర్పంచ్ రఘు, స్థానిక ఉప సర్పంచ్ విశ్వనాథరెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నారెడ్డి, సుధీర్, రేవంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు సోమశేఖర్‌నాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, మీనాకుమారి, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణ మనందరి బాధ్యత





బంగారుపాళెం: పాలేరులో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న అటవీశాఖ అధికారులు, విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ మోహన్

బంగారుపాళెం: జంతు సంరక్షణ మనందరి బాధ్యతని బంగారుపాళెం ఫారెస్ట్ సెక్షన్ అధికారి శివకుమార్ అన్నారు. మండలంలోని పాలేరు గ్రామంలో బుధవారం ప్రపంచ జంతు దినోత్సవాన్ని ప్రాథమిక పాఠశాలలో అటవీశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మన చుట్టూ ఉన్న జంతువులపై జాలి, దయ చూపాలని చెప్పారు. మూగజీవులైన జంతువులు కూడా స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందన్నారు. పర్యావరణం–వన్యప్రాణుల పరిరక్షణపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. వారం రోజుల పాటు జంతు వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అటవీ శాఖ అధికారులు రామకృష్ణ, ప్రతాప్, డిల్లీరాణి, పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

ఐరాల: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని మండల అటవీశాఖాధికారి జయశంకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపల్ రెడ్డి రామరాజు ఆధ్వర్యంలో వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. జయశంకర్ మాట్లాడుతూ వృక్ష సంపదను, వన్యప్రాణులను రక్షించుకుని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్య అతిథి ఎంపీపీ మోహన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు వన్యప్రాణులు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అడవి జంతువుల ప్రాముఖ్యతను తెలియజేసి, వాటి సంరక్షణకు చేపట్టాల్సిన అంశాలను వివరించేందుకు ప్రభుత్వం ఏటా వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులకు వన్యప్రాణులపై అవగాహన వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఐరాల బీట్ అధికారి రెడ్డి ప్రసాద్, ఎఫ్‌బీఓలు శంకరప్ప, లావణ్య, పద్మావతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నగరంలోని అన్ని వార్డుల్లోనూ అభివృద్ధికి ఆమోదం





మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు నగర మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

- కార్పొరేటర్లు ప్రతిపాదనలిస్తే ఆ మేరకు పనులు చేపడతాం
- చిత్తూరు మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్పష్టీకరణ

చిత్తూరు అర్బన్: అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం విరివిగా నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని చిత్తూరు నగర మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్పష్టం చేశారు. వార్డుల్లో చేపట్టాల్సిన పనుల కోసం కార్పొరేటర్లు ప్రతిపాదనలు ఇస్తే నిధులు తీసుకొచ్చేందుకు జిల్లా మంత్రులు తప్పకుండా సాకారం అందిస్తారన్నారు. చిత్తూరు మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ, చిత్తూరు నగర అభివృద్ధికి సభ్యులంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ నగర అభివృద్ధికి ప్రభుత్వం రూ.15 కోట్ల నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. నగరంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయని చెప్పారు. అత్యధిక ప్రాధాన్యత ఉన్న కట్టమంచి బైపాస్ రోడ్డు, చవటపల్లి రోడ్డు, కొంగారెడ్డిపల్లిలోని వెంగళరావు కాలనీ మేజర్ డ్రైనేజీ నిర్మాణానికి సత్వరం చర్యలు ప్రారంభించాలన్నారు. కమిషనర్ అరుణ మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అన్ని వార్డుల్లో చేపట్టిన పనులకు సంబంధించిన వివరాలను సభ్యులకు అందజేస్తామన్నారు. సమావేశంలో భాగంగా అజెండా అంశాలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. నగర పాలక సంస్థ పరిధిలో కట్టమంచి వై జంక్షన్ నుంచి సాంబయ్య కండ్రిగ పుత్తూరు రోడ్డు వరకు రోడ్డును అభివృద్ధి చేసేందుకు రూ.3.95కోట్లు, సంతపేట దుర్గమ్మ గుడి నుండి చౌటపల్లి మీదుగా జాతీయ రహదారి వరకు రోడ్డు అభివృద్ధికి రూ.1.79 కోట్లు, కొంగారెడ్డిపల్లి మెయిన్ రోడ్డులో మేజర్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.85 లక్షలు కేటాయిస్తూ పాలకవర్గం ఆమోదిస్తున్నట్లు మేయర్ అముద ప్రకటించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, నగర పాలక అధికారులు పాల్గొన్నారు. నిధులు మొత్తం ఒకే ప్రాంతానికి పరిమితం చేయడం వల్ల వెనుకబడ్డ ప్రాంతాల్లో అభివృద్ధి ఉండదని పలువురు సభ్యులు ఆందోళనకు దిగారు.

సీఎం హామీ.. చిత్తూరుకు నిధులు!

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్తూరు పర్యటన నేపథ్యంలో ఇచ్చిన హామీ మేరకు నగర అభివృద్ధికి తొలి విడతగా రూ.15 కోట్లు విడుదల చేశారు. ఈ ఏడాది జూలై 4వ తేదీన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్తూరులో అమూల్ డెయిరీ శంకుస్థాపనకు వచ్చినపుడు నగర అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రతిపాదించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను తీర్చడానికి అన్ని మునిసిపాలిటీలకు రూ.20 లక్షలు విడుదల చేస్తే, చిత్తూరుకు అదనంగా ఒక్కో డివిజన్‌కు రూ.50 లక్షల చొప్పున నిధులు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు. దీనికి ప్రతిపాదనలు పంపాలని సీఎం సూచించారు. పనులు ఎక్కడెక్కడ చేయాలన్న దానిపై ప్రజాప్రతినిధులు ప్రతిపాదనలు రూపొందించారు. తొలి విడతగా గడప గడపకు మన ప్రభుత్వం పనులను చేయడానికి రూ.15 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో రూ.6.59 కోట్లతో ప్రాధాన్యత ఉన్న మూడు పనులను చేయడానికి పాలకవర్గం ఆమోదం తెలిపింది. మరోవైపు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద పనులు చేయడానికి ఒక్కో డివిజన్‌కు రూ.20 లక్షలు చొప్పున రూ.10 కోట్లను 50 డివిజన్లకు విడుదల చేస్తూ ఆర్నెళ్ల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు

చిన్నకృష్ణునితో నాట్యం చేస్తున్న గోపికలు



నాట్యం చేస్తున్న కళాకారులు



పౌరాణిక నాటకంలోని ఓ సన్నివేశం



వరసిద్ధునికి కళా నీరాజనం



అలరించిన చిన్నారి గాయకులు



భక్తి గీతాలు ఆలపిస్తున్న గాయకులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా, ఆలయ ఆస్థాన మండపంలో బుధవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అందులో ప్రధానంగా చిన్నపిల్లల భక్తి గీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాకారులు భరత నాట్య ప్రదర్శనలు, గాయకుల భక్తి గీతాలాపన, చిన్నారులు నిర్వహించిన నృత్యాలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



కళాకారులతో ఆలయ అర్చకులు